తెగుళ్లతో రైతుల వర్రీ

ఈ ఏడాది అన్నదాతలకు వ్యవసాయం కలిసిరావడం లేదు. భారీ వర్షాలతో వేరుశనగ, ఆముదం పంటలు దెబ్బతిన్నాయి. ఆ వర్షాల ప్రభావంతో తెగుళ్లు అధికమై మిర్చి పంట దెబ్బ తినింది. ఆదే కోవలో వరి పంట కూడా చేరింది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటపై వాతావరణ మార్పుల ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో తీవ్రమైన ఎండలు.. ఆపై ఉక్కపోత.. అంతలోనే భారీ వర్షాలు.. ప్రస్తుతం.. చలిగాలులు, పొగ మంచు కారణాలతో వరి పైరుకు కంకినల్లి, సుడిదోమ, అగ్గి, ఎర్ర తెగుళ్లు సోకాయి. దీంతో చేతికందివచ్చిన పంట..ఇంటికి చేరుతుందా..అనే కలవరపాటు రైతుల్లో మొదలైంది.

- చేతికొచ్చే సమయంలో తెగుళ్లు బారిన వరి పైరు
- వెంటాడుతున్న సుడిదోమ, అగ్గితెగులు, ఎర్ర తెగులు
- నివారణకు శ్రమిస్తున్న రైతాంగం
- వరుస వర్షాలతో ఆరని తడి, పెరుగుతున్న చలిగాలులు, పొగమంచు
- దిగుబడి తగ్గుతుందని అన్నదాతల ఆందోళన


పెనుమాడ చెరువు కింద ఎర్ర తెగులుతో దెబ్బతిన్న వరి పంట


కంబాలపాడు చెరువు కింద సుడిదోమ, ఎర్ర తెగులుతో దెబ్బతింటున్న వరి పైరు

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో హంద్రీనీవా రిజర్వాయర్, చెరువులు, బోర్లు, బావుల కింద దాదాపుగా 2వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. కృష్ణగిరి మండలంలో పెనుమాడ, కంబాలపాడు, కూర్మగిరి, ఎల్లనాగిరెడ్డి, తుమ్మల చెరువు, బోయినాల, సొడమ్మ చెరువులతోపాటు హంద్రీనీవా ప్రధాన కాల్వ వెంట, కృష్ణగిరి రిజర్వాయర్‌తో పాటు హంద్రీ ఒడ్డున ఉన్న పుట్లూరు, తొగర్చేడు, టి.గోకులపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, మన్నెకుంట గ్రామాల్లో అధికంగా వరి సాగు చేశారు. అలాగే వెల్దుర్తి మండలంలోని బోగోలు, సూదాపల్లె చెరువులతోపాటు హంద్రీ ఒడ్డున ఉన్న చెరుకులపాడు, కొసనాపల్లె తదితర గ్రామాల్లో వరి పంట వేశారు.

వెంటాడుతున్న తెగుళ్లు..

అన్ని ప్రాంతాల్లోనూ వరి పంటను తెగుళ్లు, కీటకాలు, ఎలుకల బెడద రైతులను వెంటాడుతోంది. అధిక విస్తీర్ణంతో సాగైన వరి పంట ప్రస్తుతం గింజ పట్టే దశలో ఉంది. ముందస్తుగా సాగు చేసిన చోట ఇప్పటికే కంకులు కట్టాయి. ఇలాంటి సమయంలో పంటకు కంకినల్లి, సుడిదోమ, అగ్గితెగులు, ఎర్ర తెగులు సోకుతుండటంతో అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరుస తుపాన్లతో తడి ఆరకపోవడం, చలిగాలులతో పాటు కమ్ముకొస్తున్న పొగ మంచు లాంటి ప్రతికూల పరిస్థితులు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి.

పెట్టుబడులు వచ్చేనా!

ఈ యేడాది ముందస్తు వర్షాలు రావడంతోపాటు హంద్రీనీవా ప్రధాన కాలువకు నీరు రావడం, చెరువులో నీరు పుష్కలంగా ఉండటంతో జూన్ చివర్లో నారు పోశారు. జూలై చివరి వారంతో పాటు ఆగస్టు మొదటి వారంలో నాట్లు వేశారు. పంట ఏపుగా రావడంతో అన్నదాతలు పెట్టుబడికి వెనుకాడకుండా మందులు వేశారు. ఆగస్టు చివరి వారం నుంచి వర్షాలు సమృద్ధిగా రావడంతో పంట ఏపుగా రావడంతో ఈ యేడాది అధిక దిగుబడులు వస్తాయని అన్నదాతలు ఆశ పడ్డారు. అయితే వారి ఆశలు పండేలా లేవు.. పంట కంకి దశలో ఉన్న సమయంలో ఒక్కసారిగా రెండు మూడు రకాలు తెగుళ్లు సోకవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. లాభాలు దేవుడేరుగు పెట్టుబడులు వస్తే చాలంటున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోగా తెగుళ్లు రోజు రోజుకు పంటను పూర్తిగా దెబ్బతీస్తుండటంతో ఏమీ చేయాలో తెలియక మదనపడుతున్నారు.

తెగుళ్ల నివారణకు అధిక ఖర్చు



హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా చెరువుకు నీరు రావడంతో రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. పంట కంకులు విడిచి గింజలు ఏర్పడుతోంది. ఈ దశలో పంటను సుడిదోమ, అగ్గి, ఎర్ర తెగుళ్లు ఆశించాయి. వాటి నివారణ కోసం ఖరీదైన పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి మరింత పెరుగుతోంది తప్పా.. తెగుళ్లు అదుపులోకి రావడం లేదు.

– నగిరి రామచంద్రుడు, రైతు, కటారుకొండ

ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేదు



పంటసాగు చేసినప్పటి నుంచి వర్షాలు రావడంతో పంట ఏపుగా పెరిగింది. కంకులు వచ్చిన సమయంలో దోమపోటు, ఎర్రతెగులు, సుడిదోమ ఆశించకుండా ముందుస్తుగా వివిధ రకాల మందులను పిచికారీ చేశా. అయితే అక్కడక్కడా దోమపోటు తీవ్రంగా ఉంది. ఎన్నో ఆశలతో ఎకరన్నరలో రూ. 75వేలు ఖర్చు పెట్టి వరి పంట సాగు చేస్తే వాతావరణంలో మార్పులతో తెగుళ్లు ఆశించాయి. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– శిగరమాను కృష్ణమూర్తి, రైతు కంబాలపాడు

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ఆస్పరి: మండల కేంద్రంలో వెలసిన మారెమ్మవ్వ, రామతీర్థంలో కొలువైన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవింద ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించకుని మొక్కులు తీర్చుకున్నారు.

మహోన్నతుడు వాల్మీకి మహర్షి


చిట్యాలలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న వాల్మీకులు

కృష్ణగిరి: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి మహోన్నతుడని సర్పంచ్ రాజేశ్వరగౌడ్, వాల్మీకి నాయకులు లక్కసాగరం రాముడు, నక్క నాగరాజు, ఉలువ బొజ్జులు కొనియాడారు. మండలంలోని చిట్యాల గ్రామంలోని బస్టాండ్‌లో శుక్రవారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో తుల సీనాథ్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ చిన్న మాదన్న, నక్క మద్దిలేటి, తలారి శంకరయ్య పాల్గొన్నారు. అనంతరం గ్రామ క్షేమాన్ని కాంక్షిస్తూ శాంతి హోమం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సైన్స్, చిత్ర లేఖనంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సి.హెచ్.నరసింహులు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో చిత్రలేఖన ఉపాధ్యాయుడు తోటకూరి అచ్చయ్యతో కలిసి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. అండర్–17, 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి సంతోష్, 8వ తరగతి విద్యార్థులు ప్రేమరాజ్, రిషి, 6వ తరగతి విద్యార్థి చిన్న జాన్.. ఈనెల 18, 19వ తేదీల్లో సత్తెనపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సైన్స్, చిత్ర లేఖన పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ మనోజ్‌రాజ్, ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసలను నివారిస్తాం


కోయిలకొండలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ నాగ సులోచన

కృష్ణగిరి: గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి వలసలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ నాగసులోచన తెలిపారు. మండలంలోని ఎరుకలచెరువు, కోయిలకొండ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు మస్టర్లు వేయడంలో తప్పులు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈసీ మధుకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థి రామకృష్ణ

దేవనకొండ: మండలంలోని గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన రామకృష్ణ, మహాలక్ష్మి దంపతుల కుమారుడు వేణు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు హరికృష్ణ, బాబునాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. వేణు ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నాడన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికపై గ్రామస్తులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దాడి కేసుపై విచారణ

హాలహర్వి: గత నెలలో మండలంలోని గూళ్యం గ్రామంలో ఉమేష్ అనే వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపరిచారు. దీనిపై విచారణ చేపట్టేందుకు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐకు సూచించారు. ఎస్‌ఐ చంద్ర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు


మాట్లాడుతున్న తహసీల్దార్

పత్తికొండ(తుగ్గలి) : అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పత్తికొండ, తుగ్గలి తహసీల్దార్‌లు రమేష్, రమాదేవి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రెండు రోజులు ప్రతి పోలింగ్ బూత్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మద్దికెర : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు శని, ఆదివారాలు రెండు రోజులు పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి నమోదు చేయాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పోలింగ్ బూత్ ఆఫీసర్లు ఉండి నమోదు చేసుకుంటారని, యువకులు వయస్సు నిర్ధారణ ధ్రువపత్రాలు అందజేసి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. డీటీ శ్రీదేవి, ఆర్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

గ్రామాల వారీగా మంజూరైన నిధుల వివరాలు..

గ్రామం	టైడ్ గ్రాంటు	బేసిక్ గ్రాంటు	మొత్తం
బసినేపల్లి	రూ. 3,30,762	రూ.2,20,507	రూ. 5,51,269
బొమ్మనపల్లి	రూ.1,45,092	రూ.96,729	రూ.2,41,821
బురుజుల	రూ.2,69,135	రూ.1,79,423	రూ.4,48,558
హంప	రూ.2,17,032	రూ.1,44,688	రూ.3,61,720
ఎం.అగ్రహారం	రూ.6,15,734	రూ.4,10,489	రూ.10,26,223
మద్దికెర	రూ.19,00,000	రూ.13,12,158.	రూ.32,12,158
పెరవలి	రూ.10,45,665	రూ.6,97,109	రూ.17,42,774
ఎడవలి	రూ.2,19,047	రూ.1,18,116	రూ.3,37,163
మొత్తం :	రూ.47,42,467	రూ.31,79,219	రూ.79,21,686

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 2024–25వ సంవత్సరానికి సంబంధించి మొదటి విడత బేసిక్ గ్రాంటు రూ.47,42,467 టైడ్ గ్రాంటు రూ.31,79,219 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 79,21,686 ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసిందని ఎంపీడీఓ సీవీ కొండయ్య శుక్రవారం తెలిపారు. బేసిక్ గ్రాంటును అభివృద్ధి పనులకు, టైడ్ గ్రాంటును పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా పనులకు వినియోగించాలని సూచించారు.

కేసు వెనక్కి తీసుకోవాలి

హాలహర్వి: ఉమేష్‌పై పెట్టిన కౌంటర్ కేసును వెనక్కి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.జె.ప్రకాష్, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం హాలహర్విలో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎల్లప్ప, మండల అధ్యక్షుడు వీరేష్, నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పది రోజుల క్రితం గూళ్యం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎద్దుల బండిపై వస్తుండగా.. మాదిగ ఉమేష్ ఆటోతో వస్తూ ఇద్దరి మధ్య వాదన జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎద్దుల బండి వ్యక్తి ఉమేష్‌పై దాడి చేయడంతో గాయపడగా చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి వెళ్లాడన్నారు. అయితే దాడి చేసిన వ్యక్తే ఉమేష్‌పై కౌంటర్ కేసు పెట్టడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి సర్వేయర్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు

ఆలూరు: రైతులు, పొదుపు మహిళలు, వ్యవసాయ కూలీలు బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును ఖాళీ చేసేందుకు అనేక మంది సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రయత్నిస్తున్నారని, వారి చేతికి చిక్కి మోసపోవద్దని ఆలూరు ఎస్‌ఐ సి.వి.నరసింహులు సూచించారు. శుక్రవారం మండలంలోని అరికెర, తండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, వారి మాయ మాటలు నమ్మి వ్యక్తిగత పత్రాలు, ఓటీపీ లాంటివి ఇవ్వొద్దని చెప్పారు. చట్టాలపై గ్రామస్తులు అవగాహన పెంచుకోవాలని, ఉచిత న్యాయసలహాలు పొందాలని న్యాయవాదులు ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్ సూచించారు.

నీటి సమస్యకు పరిష్కారం


అంగన్‌వాడీ కేంద్రంపై ఏర్పాటు చేసిన సింటెక్స్

హాలహర్వి: సిద్ధాపురం, బల్లూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు స్వచ్ఛభారత్ మిషన్ కింద సింటెక్స్‌లను అందించినట్లు సర్పంచ్ మారన్న, ఎంపీటీసీ గాదిలింగప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సింటెక్స్‌ను అంగన్‌వాడీ సెంటర్‌పై ఏర్పాటు చేయించారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

పత్తికొండ(తుగ్గలి): ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరమని వైద్యాధికారిణి నాగాంబిక అన్నారు. శుక్రవారం మండలంలోని పుచ్చకాయలమాడలో పీహెచ్‌సీలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి సోకే విధానం, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి వచ్చిన తర్వాత తీసుకునే చర్యలు కంటే వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టడం ముఖ్యమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధికి ఉచిత పరీక్షలతో పాటు, ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

110 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల కేటాయింపు

మద్దికెర : మండలానికి 110 క్వింటాళ్లు కే–6 రకం వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ రవి శుక్రవారం తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. విత్తన వేరుశనగ పూర్తి ధర రూ.9,600 కాగా.. ప్రభుత్వ సబ్సిడీ రూ.3,840 పోగా రైతు రూ.5,670 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక రైతుకు కనీసం 90 కిలోల వరకు విత్తనాలు అందజేస్తామని చెప్పారు. అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భువన గాయత్రీకి ప్రత్యేక పూజలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని భువన గాయత్రీ మాతను వీరబ్రహ్మేంద్రస్వామి మఠం 8వ తరం పీఠాధిపతి వీరంభట్లయ్య శుక్రవారం దర్శించుకున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత మహిమ కలిగిన ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ లలితా పీఠం పీఠాధిపతి సుబ్రహ్మణ్య స్వామిని గాయత్రీ పీఠం పీఠాధిపతి బాలకృష్ణస్వామి సన్మానించారు.

మహిళలను అక్షరాస్యులుగా మారుస్తాం


మాట్లాడుతున్న రమణయ్య

దేవనకొండ: జీవితకాల అభ్యసనం అనే కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, మండల ప్రయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ రమణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక మండల స్త్రీ శక్తి భవన్‌లో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (యూఎల్‌ఎల్‌ఏఎస్– ఉల్లాస్) ద్వారా మహిళలకు చదువు చెప్పే కార్యక్రమాన్ని చేపట్టారు. వయోజన విద్యా, సెర్ప్ శాఖలు సయుక్త నిర్వహణలో చదువురాని మహిళలకు చదవడం, రాయడం, లెక్కలు వేయడం నేర్పించే అంశాల గురించి మండలస్థాయి వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ఒక వలంటీర్ పది మంది చదువురాని మహిళలకు చదవడం, రాయడం, చిన్న,చిన్న లెక్కలు చేయడాన్ని స్వచ్ఛందంగా నేర్పించాలని చెప్పారు. మండల సమాఖ్య కార్యాలయ హెచ్‌డీ సీసీ నరసన్న, వెలుగు సిబ్బంది, సీసీలు, వీఓఏలు, వివిధ గ్రామాల వలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

హాలహర్వి: బల్గోట గ్రామ బసవేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9, 10, 11వ తేదీల్లో కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు ముదుకయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. విరుపాపురం గ్రామ సమీపంలోని బల్గోట గ్రామంలో వెలిసిన బసవేశ్వరస్వామి ఆలయంలో శనివారం 101 కలశాలతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం రుద్రాభిషేకం, మహామంగళహారతి, అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, సోమవారం రుద్రహోమం, గణపతి హోమం, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామంలో ప్రతి సోమవారం ఎద్దులకు పూజలు చేస్తామని, పొలం పనులకు తీసుకెళ్లమని, వాటికి విశ్రాంతినిస్తామని వివరించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


వేడుకలకు ముస్తాబయిన బసవేశ్వరస్వామి ఆలయం

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ ఆదేశించారు. మండలంలోని ఆగవేలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ..కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని, అలాగే గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేసే సరుకులు అందజేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం చేసే ప్రాంతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

హొళగుంద: మండల కేంద్రంలో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా మద్యం షాపును ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని దళిత, కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. శుక్రవారం సీపీఎం, సీఐటీయూ మండల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నాగరాజు, దళిత సమాఖ్య మండల అధ్యక్షుడు నల్ల మల్లేష్ తదితరులు మాట్లాడుతూ సిద్ధేశ్వరస్వామి, మారెమ్మ దేవి ఆలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే ప్రధాన దారిలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని, మందుబాబులు, ఆకతాయిలు తాగిన మైకంలో రోడ్డుపై వెళ్లే మహిళలు, పొలాలకు వెళ్లే కూలీలతో పాటు విద్యార్థినులపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశించారు. ఎక్సైజ్ అధికారులు ఇలాంటి ప్రాంతాల్లో దుకాణం ఏర్పాటు అనుమతులు ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దుకాణాన్ని అక్కడి నుంచి మార్పించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ఆదోని రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

హొళగుంద: హొళగుంద– ఆదోని రోడ్డులోని హొళగుంద శివారులోని వంతెనపై నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంతంలో అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోగా..రక్షణ గోడలు నిర్మించకపోవడంతో కల్వర్టు మలుపు ఉన్న ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది వేగాన్ని నియంత్రించ లేక వంకలోకి బోల్తా పడుతున్నారు.ముఖ్యంగా రాత్రి పూట రోడ్డు మలుపును గుర్తించలేక వంకలోకి దూసుకెళ్లి ప్రమాదాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రక్షణగోడ, మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం,చిట్యాలలో గోశాలను ప్రారంభిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతి

హొళగుంద: మండలంలోని సమ్మతగేరి గ్రామంలో శుక్రవారం కొరువంజమ్మ దేవి విగ్రహం, నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా గంగ పూజ, నూతన ఆలయంలో జలాభిషేకం, ధాన్యాభిషేకం, హోమాలు, యజ్ఞాలు, వాస్తు పూజలు తదితర వాటిని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం జె.హొసళ్లి మఠం పీఠాధిపతులు శంభులింగస్వామి శివాచార్యులు నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదాన, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. గ్రామస్తులు ఆడపడుచులకు ఒడి బియ్యం పోశారు.

కృష్ణగిరి: ఎక్కడ రామనామం వినిపిస్తుందో అక్కడ ఆంజనేయస్వామి ప్రత్యక్షమవుతారనే విశ్వాసం ప్రతి హిందువులో ఉందని వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతి వీరంభట్లయ్య స్వామి అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో అక్షిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభయ అంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా దేవాలయ ఆవరణలో గోశాలను ప్రారంభించారు. గ్రామంలో మూడు రోజులుగా జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమాలు ముగిశాయి. మధ్నాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం నెల్లూరు కళాకారులతో కోలాటం అలరించింది. కార్యక్రమంలో కర్నూలు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యంస్వామి, వెల్దుర్తి దగ్గర 51 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ వ్యవస్థాపకులు రామాంజనేయులు స్వామి, వెల్దుర్తి భువనగాయత్రి ట్రస్ట్ చైర్మన్ జూలకంటి రఘునాథరెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకులు రామాంజనేయులు, రాజ్యలక్ష్మి, సభ్యులు మోహనాచారి పాల్గొన్నారు.


నూతనంగా ప్రతిష్ఠించిన అభయ అంజనేయస్వామి మూలవిరాట్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


మహేశ్వరి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

మద్దికెర : స్థానిక కాలువ వీధిలో వెలసిన మహేశ్వరీ దేవి దేవాలయంలో శుక్రవారం మహేశ్వరి దేవి కలశ, పోతురాజు సమేత విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, లోహన్యాసం, నవరత్న నాసం, శిఖర , విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంబాభిషేకం, మహా పూర్ణహుతి, మంత్ర పుష్పం, మహా మంగళహారతి తదితర పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు ప్రసాదం వితరణ చేసిన అనంతరం అన్నదానం చేశారు.